# నగరంలో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు..!

**- ఇటీవలి కాలంలో వరుస సంఘటనలు**
**- నిబంధనలు ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు జరిమానా**

**జూబ్లీహిల్స్, జూన్ 11, ప్రభాతవార్తః** నగరంలో రౌడీ షీటర్ల వ్యవహార శైలి మళ్లీ ఆందోళన కలిగిస్తోంది. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు చూస్తే, రౌడీ షీటర్ల బెదిరింపులు, వసూళ్లు, కత్తి దాడులు, గంజాయి మత్తులో హల్చల్ వంటి నేరాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 1300లకుపైగా రౌడీషీటర్లు ఉండగా, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 745 మంది, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 128 మంది ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఒకవైపు రౌడీషీటర్ల బైండోవర్, ఠాణాలకు పిలిపించి కౌన్సిలింగ్, ఇళ్ల వద్ద మ్యాపింగ్ చేస్తున్నప్పటికి కొందరు రౌడీషీటర్లు తమ పద్ధతి మార్చుకోలేకపోతున్నారు.. తమ పాత పద్ధతుల లోనే బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నారు.. జైళ్లకు పంపినా తిరిగి వచ్చి మళ్లీ కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. సుల్తాన్ బజార్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ రౌడీ షీటర్ విష్ణువ్ కిషన్ దాస్ అలియాస్ గణేష్ మహరాజ్‌ను పోలీసులు 14 ఏళ్ల తర్వాత అరెస్టు చేశారు. హత్య, హత్యాయత్నం, దొంగతనాలు, ఆయుధాల చట్టం కింద మొత్తం 21 కేసుల్లో నిందితుడైన అతడు, తన గుర్తింపును మార్చుకుని పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లు విచారణలో గుర్తించారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న సంఘటనలు మరోసారి రౌడీషీటర్ల వ్యవహారశైలిపై చర్చనీయంశంగా మారుతున్నాయి. అంతేకాకుండా ఇటీవల మాదకద్రవ్యాల పరీక్షలు నిర్వహించగా మూడు కమిషనరేట్ల పరిధిలో పలువురు రౌడీషీటర్లు గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. దీనికి తోడు తాజాగా మాజీ రౌడీషీటర్ అంబర్‌పేట శంకర్ ఒక సంఘటనలో ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందడం ఆందోళన కలిగిస్తుంది.

**ఇటీవలి సంఘటనలివి..**

- అబిడ్స్‌లోని ప్రముఖ తాజ్ మహల్ హోటల్‌లో జూబ్లీహిల్స్‌కు చెందిన రౌడీ షీటర్ సయ్యద్ సయీద్ బహదూర్ హోటల్ సిబ్బందిని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ఘటన సంచలనం రేపింది. బిల్లు చెల్లించకుండా వెళ్లేందుకు ప్రయత్నించిన అతడు, తనను తాను బ్లేడ్‌తో గాయపరుచుకుని రూ.10 వేల కోసం హోటల్ సిబ్బందిని బెదిరించాడు. అతనిపై ఇప్పటికే 41కు పైగా కేసులు నమోదై ఉండటం గమనార్హం.
- గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ పవన్ గంజాయి మత్తులో నాగరాజు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్ర గాయాలకు కారణమయ్యాడు.
- బంజారాహిల్స్ ఠాణా పరిధిలో ఐస్‌క్రీమ్ విక్రేతను అడ్డగించి బెదిరించిన రౌడీ షీటర్ కాలా షోయబ్‌పై కేసు నమోదైంది.
- మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ అతౌల్లా డబ్బులు ఇవ్వలేదనే కారణంతో ఇద్దరు యువకులపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.
- చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీ షీటర్ మిర్జా సల్మాన్ అలీ బేగ్, బైండ్ ఓవర్ బాండ్ నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.1 లక్ష జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఇది నగర పోలీసుల ప్రివెంటివ్ పోలీసింగ్ చర్యల్లో భాగంగా చేపట్టిన కీలక చర్యగా భావిస్తున్నారు.
- బంజారాహిల్స్ శ్రీరాంనగర్‌లో కొద్ది రోజుల కిందట గంజాయి సేవించి పట్టుబడిన వారిలో రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. భోళానగర్‌లో జన్మదిన వేడుకల సందర్భంగా సౌండ్ తగ్గించలేదనే వివాదంతో రౌడీ షీటర్ అఫ్రిది అహ్మద్ అలియాస్ అజార్ కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డాడు.

**పాత పద్ధతులు మార్చుకోలేక..**

నగరంలో రౌడీ షీటర్లు చిన్నచిన్న వివాదాలను హింసాత్మక ఘర్షణలుగా మార్చడం, డబ్బుల కోసం బెదిరింపులకు దిగడం, మత్తు పదార్థాల వినియోగం పెరగడం వంటి అంశాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. అయితే ఇటువంటి అలవాటు నేరస్తులపై ప్రత్యేక నిఘా, బైండ్ ఓవర్ చర్యలు, రౌడీ షీట్ సమీక్షలు, ఆకస్మిక తనిఖీల ద్వారా పోలీసులు ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు రౌడీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై ఉపేక్ష ఉండదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికి కొందరు తమ పాత పద్ధతులను, దందాను మార్చుకోలేక ఎక్కడోదగ్గర తమ నైజాన్ని బయటపెడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఒక రౌడీషీటర్‌కు సైతం నగర పోలీసులు జరిమానా విదించడం ఇందుకు అద్దం పడుతుంది. మరోవైపు రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, వారి కదలికలపై దృష్టి పెడుతున్నామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా వారిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేస్తున్నారు. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

హైదరాబాద్ వార్త



# వరద ఎలా వస్తుంది..?

**-ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటన**
**-నీరు నిలవడానికి గల కారణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన**

మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలోని విఠల్‌రావునగర్ వద్ద ఎస్ఎన్‌డిపి ప్రాజెక్ట్ కింద కట్టిన వరద కాలువ అనుసంధాన సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:** నగరంలో వరద ముంచెత్తిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం పరిశీలించారు. మాదాపూర్, కొండాపూర్, మియాపూర్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి వరద ముంచెత్తడానికి గల కారణాలను తెలుసుకున్నారు. కొండాపూర్ నుంచి మొండికుంటకు చేరాల్సిన వరద నీరు ప్రవాహానికి మీనాక్షి టవర్స్ వద్ద డ్రైన్లో తలెత్తిన ఇబ్బందులే కారణమని గుర్తించారు. బాక్స్ డ్రైన్‌ను పూర్తిగా స్లాబ్ వేసి మూసేయడంతో అందులో పూడికను తీయడానికి వీలు లేని పరిస్థితి ఉతులున్నాయి. అలాగే మీనాక్షి టవర్స్ వద్దకు వచ్చేసరికి వరద కాలువ కుంచించుకు పోవడం కూడా ఒక కారణంగా గుర్తించారు. వెంటనే కాలువను తెరిపించి..పూడికను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైతే కాలువను విస్తరించాలని సూచించారు. ఒక్క మొండి కుంట వద్దే కాకుండా.. గచ్చిబౌలి ప్రధాన రహదారిలోని బయోడైవర్సిటీ పార్కు పరిసరాలు నీట మునగడానికి కూడా అక్కడ ఉన్న ఖాజాగూడ చెరువుతో పాటు.. మల్కం చెరువుకు వెళ్లే ఇన్‌లెట్లు సరిగా లేకపోవడమే కారణమని గుర్తించారు. ఇన్‌లెట్లు సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెండు రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి వర్షం కారణంగా పెద్దమొత్తంలో రహదారులపై ఉన్న వ్యర్థాలు కొట్టుకు వచ్చి చెత్త అడ్డుపడడం వల్ల కూడా చాలా చోట్ల వరద రహదారులను, పరిసరాలను ముంచెత్తినట్టు గ్రహించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ పరిసరాల్లో పూడుకుపోయిన నాలా, మ్యాన్‌హోల్ కారణంగానే వరద నీరు నిలిచిందని.. వెంటనే సమస్య పరిష్కరించాలని సూచించారు.ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బాక్స్ డ్రైన్‌కు గతంలో ఉన్న లైన్లను అనుసంధానం చేయడంలో తలెత్తిన ఇబ్బందులతోనే మాధాపూర్‌లోని నెక్టర్ గార్డెన్స్ పరిసరాల్లో రహదారులు నీట మునిగాయని గుర్తించారు. ఈ అనుసంధానంతో పాటు.. రహదారులపై నుంచి వచ్చే వరద కాలువలోకి వెళ్లేలా అక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గం చెరువులో నీటి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తే ఈ ప్రాంతంలో వరద పోటెత్తదని.. ఆదిశగా చర్యలు తీసుకుంటున్నారు. మియాపూర్లోని గురునాథ్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలు వలు సరిగా లేకపోవడంతో జేపీనగర్ చౌరస్తాతో పాటు లక్కీ రెస్టారెంట్ వద్ద ప్రధాన రహదారిలో నీరు నిలిచిపోయిందని అధికారులు గుర్తించారు. ప్రిమార్క్ సుంకృతి అపార్ట్‌మెంట్ పరిసరాల్లో చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువ ఆక్రమణలకు గురి కావడం మొత్తం మూసేయడంతో వరద నీరు రహదారులను ముంచెత్తిన పరిస్థితులను గమనించారు. అలాగే ఇటీవల కొత్తగా రహదారులు నిర్మించినప్పుడు పక్కనే ఉన్న వరద కాలువల్లోకి వర్షం నీరు వెళ్లే ఏర్పాట్లు బంద్ అవ్వడం కూడా ఒక కారణంగా గుర్తించారు. వెంటనే వరద కాలువలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ వెంట హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య డీఎఫ్‌వో, ఎస్ ఎఫ్‌వోలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

# బడిబాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలి

**విద్యార్థుల నమోదు, మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తిచేయాలి - అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశం**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి, డీఈవో యాదయ్య తదితరులు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:** పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో 481 ప్రాథమిక పాఠశాలలు, 8 ఉన్నత ప్రాథమిక పాఠశాలలు, 183 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 25 ప్రీప్రైమరీ పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు, అదనంగా 275 ప్రీప్రైమరీ పాఠశాలలకు అనుమతులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థుల ఆధార్ ప్రక్రియ 59 శాతం ఉండగా మిగతా ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఉపాధ్యాయుల కొరత వంటి మౌలిక , పరిపాలనా సమస్యలను గుర్తించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రులతో ప్రత్యక్ష సంప్రదింపులు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభమైన వెంటనే యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తెలుగు, ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో తక్కువ నమోదు ప్రక్రియ అంశంపై సమీక్షిస్తూ, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆంగ్ల మాధ్యమ విద్యపై ఆసక్తి చూపుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, అవసరమున్న ప్రాంతాల్లో ఆయా పాఠశాలలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలుగా మార్చే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.బడిబాట కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఉప విద్యాశాఖ అధికారులు,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

**-డ్రైనేజీల డీసిల్టింగ్ పనులు వేగవంతం..**
**దోమల నివారణకు ప్రత్యేక చర్యలు**
**-మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**

అధికారులకు సూచనలు ఇస్తున్న కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త :** వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి హయత్‌నగర్ బంజారా కాలనీ, రాఘవేంద్ర హోటల్ పరిసరాలు, హైకోర్టు కాలనీ, కప్పల చెరువు, యశోద ఎన్‌క్లేవ్, హరిహరపురం కాలనీ, గాంధీనగర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు.లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని, నిల్వ నీటిని వెంటనే తొలగించి దోమల పెరుగుదలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే డీసిల్టింగ్ పనులను వేగవంతం చేసి వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.హైడ్రా అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బందితో సమావేశమైన కమిషనర్ వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైకోర్టు కాలనీ, కప్పల చెరువు, హరిహరపురం ప్రాంతాల్లో యాంటీ లార్వా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేసి దోమల ఉత్పత్తి కేంద్రాలను పూర్తిగా నిర్మూలించాలని ఎంటమాలజీ బృందాన్ని ఆదేశించారు. యశోద ఎన్‌క్లేవ్ పార్కు నిర్వహణ, పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించిన ఆయన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని యూసీడీ విభాగం అధికారులకు సూచించారు. గాంధీనగర్‌లో డ్రైనేజీ అనుసంధానం, నీటి నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు అప్రమత్తంగా పనిచేయాలని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి స్పష్టం చేశారు.

# కారు కింద పడి బాలుడు మృతి..

**- కంపెనీ ముందు కుటుంబ సభ్యుల ఆందోళన**

**అత్తాపూర్ జూన్11,ప్రభాతవార్త :** మైలర్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది.కారు చక్రాల కింద పడి శివం (3) అనే బాలుడు మృతి చెందాడు. విజయ్ నేహా పాలిమర్స్ కంపెనీకి చెందిన కారు ప్రమాదానికి కారణమైనట్లు గుర్తించారు.ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు కంపెనీ ముందు ఆందోళన చేపట్టారు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటన కారమైణ కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గురువారం యూపీహెచ్‌సీని సందర్శించిన ఆయన అక్కడ అమలవుతున్న వివిధ ఆరో గ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అల్ట్రాసౌండ్ యూనిట్, ఎక్స్‌రే విభాగం, ల్యాబ్, టీబీ యూనిట్, ఔషధ పంపిణీ కేంద్రం తదితర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణ సమయాలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిం చాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవా లని సూచించారు. గర్భిణీలకు మెగైన సేవలు అందించటంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపు పరీక్షలు, టీకాల కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, ప్రజారోగ్య సేవల బలోపేతానికి ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఆరోగ్యం కేంద్రంలోని సౌకర్యాలు, సేవల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేసిన ఆయన, వాటిని మరిం త మెరుగుపరిచేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన కాలనీలు

**-సిఎంసి కమిషనర్ సృజన**

అంజయ్యనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ జి.సృజన

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన కాలనీల నిర్మాణం జరగుతందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన అన్నారు. ఈమేరకు గురువారం జోనల్ కమిషనర్‌తో కలిసి అంజనేయ నగర్. ప్రాంతంలోని పలు ప్రదేశాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ, జివిపిల నిర్మూలన చర్యలు పరిశుభ్రత కార్యక్రమాలను సమీక్షించారు. చెత్త వేయడాన్ని నిరోధించేందుకు స్థానిక నివాసితులు స్వచ్ఛందంగా ..సీసీటీవీ కెమెరా, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయడాన్ని కమిషనర్ అభినందించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయడాన్ని అరికట్టేందుకు సంబంధిత భూ యజమానులు తమ స్థలాలకు కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ చర్యల ద్వారా పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు అక్రమ చెత్త పారవేతను నివారించవచ్చని తెలిపారు. అనంతరం ఉదాసీన్ ల్యాండ్.. ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్ననిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాల (సిఅండ్‌డి) అక్రమ డంపింగ్ మరియు ఇతర సమస్యలను సమీక్షించారు. అలాగే సంపూర్ణ అపార్ట్‌మెంట్స్‌ను సందర్శించి, అక్కడ నివాసితుల సంక్షేమ సంఘం అమలు చేస్తున్న గ్రీన్ లీఫ్ కంపోస్టింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ తనిఖీల సందర్భంగా పరిశుభ్రమైన కాలనీల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన పారిశుద్ధ్య నిర్వహణ సమన్వయ చర్యల ప్రాముఖ్యతను కమిషనర్ నొక్కి చెప్పారు. ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు ఇతర భాగస్వాములతో కలిసి సుస్థిర వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహిస్తూ, పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన సైబరాబాద్ నిర్మాణానికి తమ కార్పొరేషన్ కట్టుబడి ఉందని తెలిపారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

రుద్రారం గ్రామం సమీపంలో భారీగా లీకేజీ అయిన మంజీరా ఫేజ్-2లోని పైప్‌లైన్

**హైదరాబాద్,జూన్ 11 ప్రభాతవార్త**

నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2లోని కలబ్‌గూర్-పటాన్‌చెరు పంపింగ్ మెయిన్‌కు చెందిన 1500 మి.మీ. వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్‌లో రుద్రారం గ్రామం సమీపంలో భారీ లీకేజీ ఏర్పడింది. ఈ భారీ లీకేజీలను అరికట్టడానికి జలమండలి అధికారులు అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయి. పనులు పూర్తి కాగానే యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుంది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్‌మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. లీకేజీ వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగడకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు.తాగునీటి అంతరాయం ఏర్పాడిన ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని ఎండి అశోక్‌రెడ్డి కోరారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు...**

- ఓఅండ్ఎం డివిజన్ 17: ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్.
- ఓఅండ్ఎం డివిజన్ 22: బీరంగూడ, అమీన్‌పూర్, భాగ్యనగర్‌కాలనీ.
- ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు.
- ఓఅండ్ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్.
- ఓఅండ్ఎం డివిజన్ 9: కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ, ప్రగతినగర్.

## సైబర్ మోసానికి గురైన ఏఎస్సై

**జూబ్లీహిల్స్, జూన్ 11, ప్రభాతవార్తః**

ఆర్టీఓ చలానా పేరుతో వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేయ డంతో ఒక ఏఎస్సై సైబర్ మోసగాళ్ల బారిన పడ్డారు. పంజా గుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్ట ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై జి. నరసయ్యకు జూన్ 8న రాత్రి విధుల్లో ఉన్న సమయంలో ఆయన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయినట్లు వరుసగా మెసేజ్‌లు వచ్చాయి. ఆయన ఖాతా నుంచి మొత్తం రూ.49,139 డెబిట్ అయినట్లు గుర్తించాడు. ఈ లావాదేవీలపై వెంటనే అతను 1930కు ఫిర్యాదు చేశారు. అనంతరం తన మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా ఆర్టీఓ చలానా పేరుతో ఒక ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అయినట్లు గుర్తించారు. ఆ ఫైల్ ద్వారానే గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు తన బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించి డబ్బులు కాజేసి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు పంజాగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

తలసాని, దాసోజులతో మహేష్ యాదవ్, వెల్దండ వెంకటేష్ తదితరులు

**జూబ్లీహిల్స్, జూన్ 11, ప్రభాతవార్తః**
క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ డివిజన్ ఇంఛార్జిలతో గురువారం తలసాని శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జి దాసోజు శ్రవణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ప్రజలతో బీఆర్ఎస్‌కు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. బూత్ లెవల్ ఏజెంట్స్, ఎస్ఐఆర్ అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. బూత్ స్థాయి కార్యాచరణ, ఓటు జాబితాల పరిశీలన, భవిష్యత్తు కార్యక్రమాలపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మహేష్ యాదవ్, వెల్దండ వెంకటేష్‌లతోపాటు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## అవయవదానంపై అవగాహన పెరుగుతుంది : డాక్టర్ టామ్ చెరియన్

దాతలను అభినందిస్తున్న వైద్యులు

**జూబ్లీహిల్స్, జూన్ 11, ప్రభాతవార్తః**
అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, అయితే మరింత మంది దాతలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు, ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ అన్నారు. ప్రపంచ అవయవ మార్పిడి దినోత్సవ వేడుకలను బంజారాహిల్స్‌లోని సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా 1995లో అయవవ దానంతో పాటు ట్రాన్స్ ప్లాంటేషన్ చట్టం తీసుకొచ్చిన నాటి హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ మాజీ ఏఐఎస్ ఏపీవీఎన్ శర్మతో పాటు లివర్ దాతలను, కాలేయ గ్రహీతలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకన్న చేయించుకున్న వారు ఎనిమిది వారాల్లోనే పూర్తి స్థాయిలో కోలుకుంటున్నారన్నారు. అవయవ దానంపై ఎంతో అవగాహన పెరుగుతుందని ప్రతియేటా దేశంలో 2లక్షల మందికిపైగా అవయవాలు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకొని ఆరోగ్యంగా జీవిస్తున్నారని అన్నారు. అయవవ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సల్లో మన దేశం ప్రపంచంలోనే అయిదో స్థానంలో ఉందని ఆయన వివరించారు.

## సుందరయ్య పార్కులో వర్షపు నీటి నిల్వ..వాకర్ల ఆవేదన

సుందరయ్య పార్కులో భారీఎత్తున నిలిచి ఉన్న వర్షపు నీరు

**చిక్కడపల్లి జూన్ 11 ప్రభాతవార్త :**
బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో రెండు రోజుల కింద కురిసిన భారీవర్షంతో పార్కులోని వాకింగ్ ట్రాక్ పూర్తిగా వర్షపు నీటితో నిండిపోవడంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్క్ అభివృద్ధి కోసం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే నీరు నిలిచిపోతుందని వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించారు. ప్రజల భద్రతను, ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి వాకింగ్ ట్రాక్ పై నిలిచి ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని డిమాండ్ చేసారు.

## గ్రేటర్ ఎన్నికలలో కూటమి పోటీ : శివ నాగేశ్వరరావు

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేతో కలసి మాట్లాడుతున్న శివనాగేశ్వరరావు

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్తః** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ మిత్ర పక్షమైన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కూటమిగా పోటీ చేయనుందని ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు పేరం స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన చేస్తూ కేంద్ర మంత్రి వర్గంలో భాగస్వాములైన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు రాంథాస్ అథవాలే సూచనలతో రాబోయే ఎన్నికలలో సరికొత్త రాజకీయ వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గ్రేటర్ ఎన్నికలలో భాగస్వామ్య పక్షాల సమన్వయంతో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునే విధంగా బలమైన అభ్యర్థిని బరిలోకి దించుతామని, దీనిపై అగ్రనాయకులతో సంప్రదింపులు జరిపామని, సానుకూలంగా స్పందన వచ్చిందని తెలిపారు. హైదరాబాద్ నగరాభివృద్ధి కేవలం మోడీ గారి డబుల్ ఇంజన్ విజన్ ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. బీజేపీ, ఆర్పీఐ(ఏ) శ్రేణులు క్షేత్రస్థాయిలో కలసికట్టుగా పనిచేస్తే, మున్సిపల్ ఎన్నికలలో చారిత్రాత్మక విజయాన్ని సాధించి, ప్రధాని మోదీకి బహుమానంగా అందించాలన్నదే ప్రధాన లక్ష్యమని వివరించారు.

## సూపరిండెంటెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్యకు సన్మానం

ఇఎన్‌టి ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆనంద్ఆచార్య సన్మానం

**గన్‌ఫౌండ్రి, జూన్ 11 ప్రభాతవార్తః** కోఠి ఇ.ఎన్.టి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య ను ఆసుపత్రి అధికారులు, సిబ్బంది శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్లు వైద్యులు బెంజిమెన్, ఆర్.కుమార్, రవిశంకర్ ప్రజాపతి, కె.శ్రీని వాస్, శ్రీకాంత్‌లోపాటు ఇఎన్‌టి టిఎన్‌జిఓ అధ్యక్షులు తూముకుం ట రాజు, ఉపాధ్యక్షులు శ్రీహరి, కోశాధికారి రవి, సభ్యులు సురేం దర్‌రెడ్డి, అస్మత్‌అలీ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## మోడీ బాటలోనే రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్‌కి కార్మికులు తగిన బుద్ధి చెప్తారు

సమావేశంలో ప్రసంగిస్తున్న బిఆర్‌టియు అధ్యక్షుడు రాంబాబు యాదవ్

**చిక్కడపల్లి జూన్ 11 ( ప్రభాతవార్త ) :** ప్రధాని నరేంద్ర మోదీ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని, లేబర్ కోడ్స్ విషయంలో కాంగ్రెస్ పార్టీకి కార్మికులు తగిన బుద్ధి చెప్పేరోజులు ఆసన్నమైందని బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లి బి ఆర్ టి యు రాష్ట్ర కార్యాలయంలో పూర్వ కనీసవేతన సవరణ బోర్డు పూర్వ చైర్మన్ పి. నారాయణ, బి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, టీవీ లక్ష్మణ్ కుమార్, సాంబశివ రావు లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను అమలు చేసే ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక శాఖ అధికారుల చేత ఐఎన్‌టియుసి , ఏఐటియుసి యూనియన్లలో రూల్స్ ప్రేమ్ చేయటానికి కార్మిక శాఖ నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించడం జరిగిందన్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మిక వర్గానికి నష్టం చేసే విధంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అమలు చేయాలని తపన పడుతున్నారు. జూన్ 8 న కార్మిక సంఘాలతో ఢిల్లీలో వీటిని రాష్ట్రంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కి బిజెపికి తేడా లేదని అర్థమవుతోంది. మోదీ చెప్పుల్లో కాళ్ళు పెట్టి రేవంత్ రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. ఈ చట్టాల వద్దని మొదటి నుండి కార్మికులకు అండగా బి ఆర్ టి యు ఉందన్నారు. ఈ కార్యక్రమాలలో మోత్కూరి జైపాల్, జగదీష్, జిల్లెల్లె పి. నారాయణ, ప్రమోద్, క్రాంతి కుమార్, వేముల మోహన్, టి.వి. లక్ష్మణ్ రావు, సాయి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయొద్దు ..కమిషనర్‌కు కార్మిక సంఘాల వినతి

కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల నిరసన వ్యక్తం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి జూన్ 11 ( ప్రభాతవార్త ) :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయవద్దని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్మిక శాఖ కమిషనర్ ను కార్మిక సంఘాల నేతలు కలిసి ఉమ్మడిగా వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు ఎం కె బోస్ మాట్లాడుతూ 2019, 2020 సంవత్సరాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను, ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. వీటిని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా అనేక సమ్మెలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూల్స్ జారీ చేసి గెజిట్ పబ్లిష్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ లేబర్ కోడ్స్ రూల్స్ రూపొందిస్తూ వర్క్ షాప్‌లు నిర్వహించడం సరికాదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, తాము రూపొందించిన రూల్స్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని అఖిల భారత, రాష్ట్ర స్థాయిల్లో అనేక సమ్మెలు, ఆందోళనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో ఏ ఐ టి యు సి , ఐ ఎన్ టి యు సి, ఐ ఎఫ్ టి యు, ఏ ఐ యు టి యు సి , సీఐటీయూ తదితర ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## దగ్గరి బందువులని నమ్మితే మోసం చేశారు : వృద్ధురాలు

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వృద్ధురాలు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్తః**
బందువులని నిమ్మితే 5 ఎకరాల వ్యవసాయ భూమిని అన్యక్రాంతం చేసి తనకు మోసం చేశారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భువనగిరికి చెందిన వృద్ధురాలు పోతం శెట్టి శ్రీవాణి మాట్లాడుతూ తన సమీప బందువైన వెంకటేశ్వర్లు తనకు పూర్వికుల నుండి రావాల్సిన 5 ఎకరాల వ్యవసాయ భూమిని ఇతరులకు తన సమ్మతి లేకుండా విక్రయించాలడని ఆరోపించారు. తన పూర్వికుల ఆస్థిని (వ్యవసాయ భూమిని)ప్లాట్లు చేసి విక్రయించి తనకు రావాల్సిన వాట ఇవ్వడం లేదని వాపోయారు. తన వాటా గురించి ప్రశ్నిస్తే నేడు రేపు అంటూ కాలయాపన చేయడంతో అతని ఇంటికి వెళ్లగా తన పై పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. వెంకటేశ్వర్లుకు రాజకీయ ప్రాభల్యం ఉండటంతో పోలీసులు తన గోడు వినిపించుకోకుండా అతని వైపే నిలుస్తు నన్ను ఇబ్బందులకు గురి చేశారని బోరున విలపించారు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నానని, ముఖ్యమంత్రి తన సమస్యను పరిష్కారం చూపుతారని హైదరాబాద్‌కు వచ్చానని తెలిపారు. తన పూర్వికుల ఆస్థిని తనకు ఇవ్వకుండా మోసం చేస్తున్న తన బందువు వెంకటేశ్వర్లు పై చట్ట రిత్య చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పోలీసులు ఉన్నతాధికారులను కోరారు. సమావేశంలో ఆమెతో పాటు ఆమె కూతురు అనూహ్య, అల్లుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అధ్యక్షుడు రాజిరెడ్డికి సత్కారం

రాజిరెడ్డిని సత్కరిస్తున్న ఎఐటియుసి నేతలు ఎం.నర్సింహ్మా, వి.ఎస్.బోస్, కె.రమేష్ తదితరులు

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్తః** ఇటీవల జలమండలిలో గుర్తింపు సంఘంకు జరిగిన ఎన్నికల్లో ఎఐటియుసి మద్దతుతో విజయం సాధించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టియుసి) అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డిని పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ఆయనకు సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.నర్సింహ్మా, ఇతర ఎఐటియుసి నాయకులు రాజిరెడ్డికి పుష్పగుచ్చాలు అందించి, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్ ,యూనియన్ నాయకులు రాఘవేందర్‌రాజ్, అక్తర్, కె.రమేష్, ఎస్.కె.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ ప్రోత్సాహమే యువత విజయాలకు బలమైన పునాది : బండారు దత్తాత్రేయ

మెట్టు బాంధవికి జేవట్టిన లడాఖ్ యాత్రను ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్తః** కుటుంబ ప్రోత్సాహమే యువత విజయాలకు బలమైన పునాది అవుతుందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం ముషీరాబాద్‌కు చెందిన మెట్టు బాంధవి అనే యువతి హైదరాబాద్ నుంచి లడాఖ్‌కు మోటార్ సైకిల్‌పై యాత్ర చేపట్టిన సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియచేశారు. బైక్ అండ్ టూరింగ్ కంపెనీ మరియు మ్యాడ్ ఓవర్ లడాఖ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ యాత్రలో పది మంది రైడర్లు పాల్గొంటుండగా, హైదరాబాద్ బృందం నుంచి సుప్రియ, కార్తీక్, కైవల్య, మౌనిక, నవ్య, పల్లవి భాగస్వాములు కానున్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియచేసిన దత్తాత్రేయ మాట్లాడుతూ నేటి యువత కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని, బాంధవి చేపట్టిన ఈ సాహసోపేతమైన యాత్ర యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటమే కాకుండా యువతులు ఏరంగంలోనైనా ధైర్యంగా ముందుకు సాగగలరనే సందేశాన్ని సమాజానికి అందిస్తుందని తెలిపారు. లడాఖ్ వంటి క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, ఎత్తైన పర్వత మార్గాలు, సవాళ్లతో కూడిన రహదారుల మధ్య ఈ యాత్రను చేపట్టటం వారి పట్టుదలకు నిదర్శనమన్నారు. బాంధవి విజయానికి ఆమె తల్లి తండ్రులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. లడాఖ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, సురక్షితంగా తిరిగి రావాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఓఆర్ఆర్‌పై లారీలో చెలరేగిన మంటలు

**దుండిగల్, జూన్ 11 ప్రభాతవార్తః** పటాన్‌చెరు నుండి దుండిగల్‌కు ఔటర్‌రింగురోడ్డుపై వస్తున్న రాంకీ సంస్థకు చెందిన హజరడస్ వేస్ట్ క్యారింగ్ లారీ ఎగ్జిట్ నంబర్ 5 వద్దకు చేరుకోగానే లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ సంస్థకు సమాచారం అందించడంతో సంస్థ ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎండ వేడికి మంటలు చేలరేగినట్లు పేర్కొంటున్నారు. సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్ర మాదం తప్పింది. అనంతరం లారీని అక్కడి నుండి సం స్థకు తర లించారు. ఈఘటనకు సంబంధించిన వీడియో ను ఓ వాహనదారుడు సోషల్ మీడియాలో పోస్టు చేయ డంతో వైరల్ అయింది. అగ్నిమాపక, పోలీసుల శాఖ వారు ఘటనకు సంబంధించి ఎటువంటి సమాచారం లేనట్లు పేర్కొన్నారు.

## భౌరంపేటలో రెండు ఇళ్లలో చోరి

**దుండిగల్, జూన్ 11 ప్రభాతవార్తః** తాళం వేసి ఉన్న లక్ష్యంగా చేసుకున్న దుండగులు రెండు ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భౌరంపేట పరిధి వివిధ ప్రాంతాల్లోని తాళం వేసి ఉన్న రెండు ఇళ్ళలో తెల్లవారుజామున దుండగలు దొంగతనానికి పాల్పడ్డాడు. తాళం పగులగొట్టి ఇండ్లలో చొరబడి ఒక ఇంట్లో రూ,45వేల రూపాయల నగదు, మరో ఇంట్లో 18గ్రాముల బంగారు ఆభరణాలు, రూ,35వేల రూపాయలు నగదును ఎత్తుకెళ్ళారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దొంగతనానికి వచ్చిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డుయ్యాయి. వాటి ఆధారంగా దర్యాప్తును చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## నిశిరాత్రి సంచరిస్తున్న వ్యక్తికి జైలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 11, ప్రభాతవార్త :** నిశిరాత్రి వేళ అనుమాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తికి కోర్టు నాలుగు రోజుల జైలుశిక్ష విధించింది. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ కథనం ప్రకారం... బండ్లగూడ హపాషాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ముహమ్మద్ ఇస్మయిల్ (48) రాత్రివేళ చీకట్లో సంచరిస్తున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతనిని వివరాలకై ప్రశ్నించగా పారిపోయాడు. పోలీసులు ఇస్మయిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. ఎస్ఐ పి.మహేందర్ అతనిపై ఈపెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని 9వ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కేసును విచారించిన కోర్టు నిందితుడు ఇస్మయిల్‌కు నాలుగు రోజులు జైలుశిక్ష విధించింది. పోలీసులు అతనిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## 11 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

**పేట్ బషీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త**
కొంపల్లిలోని సెంట్రల్ పార్క్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో పేట్ బషీరాబాద్ పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితులు సూరజ్ మండల్, పరమేష్ బైరాగి, జయదేవ్ మండల్‌గా గుర్తించారు. వీరంతా ఒడిశా రాష్ట్రానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. నిందితులను విచారించగా, ఒడిశా నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి కొంపల్లి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు సమాచారం. నిందితుల వద్ద నుంచి సుమారు 6 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చే సుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఫీజు బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

ధర్నాలో జివొల ప్రతులను చించివేస్తున్న వి.శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ తదితరులు

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్తః** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్న ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం ప్రభుత్వం సంక్షేమ పథకమా? లేక ప్రైవేటు ఫైనాన్స్ పథకమా? అని రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ విద్యార్థి జెఎసి ఛైర్మన్ వేముల రామకృష్ణ ప్రశ్నించారు. విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థులు గురువారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ జివొ నెంబర్లు 8, 9 ప్రతులను చించివేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జివొలు, కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలను చెల్లించకపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజుల్లోగా విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమచేసి, కళాశాలలకు చెల్లించకపోతే రెవిన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం అమలు చేస్తారా?, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతారా అని వారు ప్రశ్నించారు. అమాయకులైన విద్యార్థులపై జులుం ప్రదర్శించడం, చిన్నచూపు చూడటం సరికాదన్నారు. స్కాలర్‌షిప్‌ల బకాయిల్లో కమిషన్లు రావని కారణంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న పదివేల ఫీజుల రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిసి జెఎసి కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, నాయకుడు ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీ అధికారులపై కక్షపూరిత చర్యలు సహించం : డా. కరాటే రాజు నాయక్

ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట మాట్లాడుతున్న డా. కరాటే రాజు నాయక్

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** రాష్ట్రంలో లంబాడీ సమాజానికి చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులపై వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారంటూ తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక, ఓయూ జేఏసీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కరాటే రాజు నాయక్ ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ గిరిజన, లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నెహ్రూ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన వారిపై చర్యలను వ్యతిరేకించడం లేదని, అయితే ఒకే వర్గానికి చెందిన అధికారులపై వరుసగా దాడులు జరగడం గిరిజన సమాజంలో ఆందోళనకు కారణమవుతోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందని, పరిపాలన, విద్య, వైద్యం, ఇంజినీరింగ్, పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో విశేష సేవలందించిన సమాజానికి గౌరవం, ప్రాధాన్యం దక్కాల్సి ఉండగా వివక్ష భావన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీ సమాజానికి మంత్రి పదవి దక్కకపోవడం, గిరిజన సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం, సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ హామీల అమలు, బడ్జెట్ కేటాయింపులు, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు మౌనం వీడి సమాజ సమస్యలపై స్పందించాలని కోరారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో తిప్పికొడతామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్య వేదిక ఓయూ జేఏసీ నాయకులు నెహ్రూ నాయక్, అల్ ఇండియా ట్రైబల్ జేఏసీ నాయకుడు రవీందర్ నాయక్, తెలంగాణ గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, ప్రధాన కార్యదర్శి విజయ్ నాయక్, సురేష్ నాయక్, ధారావత్ సురేష్ నాయక్, నరేష్ నాయక్, భాస్కర్ నాయక్, గోపి నాయక్ తదితర గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వృత్తిదారుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి వినతి పత్రం, జ్ఞాపికను అందజేస్తున్న వృత్తిదారుల సంఘం ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జూన్ 11, ప్రభాతవార్త :** ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్షులు గట్టు సుదర్శన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్ జిల్లా కల

## కల్లు కాంపౌండ్ ఏర్పాటుకు అనుమతించవద్దు

తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**అడ్డగుట్ట, జూన్ 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2 వార్డు లోని రసూల్ పుర,చంద్ర నగర్ కాలనీ సమీపములో కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అందుకు అనుమతి ఇవ్వ కూడదని బోయిన్ పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి ఎన్ శ్రీనివాస్, చంద్ర నగర్ కాలనీ ప్రతినిధులు శ్రీరాములు , కృష్ణమూర్తి, వీరేష్, శంకర్‌లు గురువారం మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో అరవింద్ కుమార్ ద్వివేదిలకు వినతిపత్రం అందజేశారు. జనవాసాల మధ్యన పాఠశాల పక్కనే కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేయడం తో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటారని వినతిపత్రులు పేర్కొన్నారు. అందువల్ల కల్లు దుకాణానికి అనుమతి ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు.

## యాదగిరిగుట్ట బస్సులు అడ్డగుట్ట మీదుగా నడపాలి

వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నేత

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:** జేబీఎస్ నుండి యాదగిరి గుట్టకు వెళ్ళే బస్సులను కొన్నిటిని వయా షెనాయ్ నర్సింగ్ హోమ్, అడ్డగుట్ట, తుకారంగేట్, న్యూ బ్రిడ్జీ, శాంతినగర్, లాలాపేట్, తార్నాకల మీదుగా నడపాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రంగ రెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ జె. శ్రీలతను కలిసి బీజేపీ నేత వి. నర్సింగ్‌రావు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఈ బస్సులు సంగీత్ చౌరస్తా, మెట్టుగూడల మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో నరేందర్ పాల్గొన్నారు.

## ఫాగింగ్ మెషిన్లు ప్రారంభించిన డిసి భోగేశ్వర్

ఫాగింగ్ మిషన్లు ప్రారంభించిన డిసి

**అల్వాల్, జూన్ 11 ప్రభాతవార్త:** పారిశుధ్యం ఆరోగ్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అల్వాల్ సర్కిల్ డిసి భోగేశ్వర్ పేర్కొన్నారు. సర్కిల్‌కు నూతనంగా కేటాయించిన రెండు ఫాగింగ్ మిషన్లుకు డిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. మోటార్ సైకిళ్ళపై గతంలో ఫాగింగ్ నిర్వహించే వారని ఆయన పేర్కొన్నారు. త్రిచక్ర వాహనం ఆటోకు(వేహికిల్ మౌంటెడ్)ఫాగింగ్ మిషన్లు ఏర్పాటు చేయడం ద్వారా మరింత సమర్ధవంతంగా దోమలను నివారించే అవకాశం ఉంటుందన్నారు. చెరువులు, కుంటలులోని లార్వా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రజాకళలో వెల్లివిరుస్తున్న ప్రాచీన కళలు

కళాకారులను ఘనంగా సత్కరించి ప్రసంగిస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, నర్సింలు, దినకర్, రవికుమార్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 71వ రోజు ప్రాచీన కళా ప్రదర్శనలతో వెల్లివిరుస్తూ ఆహుతులను అలరిస్తున్నాయి. నేటి కళాప్రదర్శనలో ముఖ్యంగా బాగ్ అంబర్‌పేటకు చెందిన కళ్లెం అంజయ్య, లక్ష్మమ్మల బృందం ప్రదర్శించిన సంప్రదాయ ఆరోదొరల కథ (కరణికోట) ఎంతో ఆసక్తికరంగాసాగి అబ్బురపరిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా కళాకారులను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేసి ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింలు, కార్యనిర్వాహక అధికారి విజయ్‌కుమార్, సలహాదారులు దినకర్, పల్లె నర్సింహలతోపాటు ఆకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మారావునగర్‌లో పర్యటించిన బిఆర్ఎస్ నేతలు

పద్మారావునగర్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నేత గుర్రం పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** పద్మారావు నగర్ వాకర్ టౌన్ ప్రాంతంలో ప్రతి నిత్యం ఎదురువుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారం నిమిత్తం నూతన పైప్ ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ అధికారులకు సూచించారు. గురువారం ఉదయం వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులతో పాటు కాలనీ అసోసియేషన్ సభ్యులతో వాకర్ టౌన్ ప్రాంతంలో పర్యటించారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైప్ లైన్స్ వల్ల జనాభా పెరగటం తో సమర్థ్యమ్ సరిపోక ప్రతి రోజు ఈ ప్రాంతంలో మురికి నీరు ప్రవహించడం తో స్థానికులు పాలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పైప్ లైన్స్ సామర్థం పెంచి అంచనాలను రోపోందించాలని ఆయన వాటర్ వర్క్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో 10 ఇల్లు ఉన్న చోట ప్రస్తుతం అపార్ట్మెంట్స్ నిర్మించడం తో దాదాపు 800 కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి రోజు డ్రైనేజి నేటి ప్రవాహంలోనే తాము జీవనం సాగిస్తున్నామని వారు వాపోయారు. కాబట్టి పైప్ లైన్ సామర్థం పెంచడమే పరిష్కారమార్గమని వారు కోరారు. ఈ పర్యటనలో వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ మురళి, బీఆర్ఎస్ నాయకులు కిరాణా శ్రీనివాస్, ముక్క శ్రీనివాస్, హరిచరీ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌గా మాన్యుల్ మొరెనో

### -రగ్బీ ప్రీమియర్ లీగ్

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్2 కోసం హైదరాబాద్ హీరోస్ పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నది. ఈనెల 16 నుంచి గచ్చిబౌలి స్టేడియం వేదికగా మొదలయ్యే రగ్బీ ప్రీమిర్ లీగ్ కోసం హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌గా స్పెయిన్ సూపర్‌స్టార్ మాన్యుల్ మొరెనో ఎంపికయ్యాడు. మొరెనోకు తోడు జట్టు వైస్ కెప్టెన్‌గా భారత్‌కు చెందిన సుమిత్‌కుమార్‌రాయ్ వ్యవహరించనున్నట్లు కేఎల్‌వో స్పోర్ట్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. గత సీజన్‌లో కాంస్య పతకంతో ఆకట్టుకున్న హైదరాబాద్ ఈసారి మరింత మెరుగైన ప్రదర్శనతో పసిడి పతకం కొల్లగొట్టాలన్న పట్టుదలతో ఉందని కేఎల్‌వో స్పోర్ట్స్ సహ యజమాని శ్రీనాథ్ చిట్టూరి పేర్కొన్నారు. బుధవారం జరిగిన హైదరాబాద్ హీరోస్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో కెప్టెన్ మొరెనో మాట్లాడుతూ సీజన్1 నుంచి హైదరాబాద్ టీమ్‌తో కలిసి పనిచేయడం చాలా బాగుంది. గత సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. కానీ ఈసారి సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతామన్న నమ్మకం ఉంది. జట్టుకు అన్ని రకాలుగా కేఎల్‌వో స్పోర్ట్స్ అండగా నిలుస్తున్నది. దీనికి తోడు మరోమారు జట్టు కోచ్, దిగ్గజ డీజే ఫోర్బ్స్ తో కలిసి పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నాం అని పేర్కొన్నాడు. హైదరాబాద్ హీరోస్‌తో కలిసి తిరిగి కొనసాగడం చాలా ప్రత్యేకంగా భావిస్తున్నాను. ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చాలనుకుంటున్నాను. దిగ్గజ డీజే ఫోర్బ్స్‌తో కలిసి పనిచేయడమనేది గొప్ప గౌరవం. ప్రతీ రోజు కొత్తగా నేర్చుకునే అవకాశం లభిస్తుంది అని వైస్ కెప్టెన్ సుమిత్‌కుమార్ రాయ్ అన్నాడు. భారత రగ్బీ జట్టుకు నాయకత్వం వహించిన సుమిత్..ప్రస్తుతం మొరెనోతో కలిసి వరుసగా రెండో సీజన్‌లో హైదరాబాద్ తరఫున బరిలోకి దిగుతున్నాడు. జట్టులో మొరెనోతో పాటు కెవిన్ వెక్సా, రెగన్ వేర్, మోరైజ్ లాంగ్‌బాటమ్, ఫ్రాన్సిస్కో కాసెల్లా, వోల్ఫమ్ హకర్, రవుమా సెరువకుల, డిగో ఆర్డో, టిటి యాఫొనో తవిట, సంబిత్ ప్రధాన్, సుమిత్‌కుమార్‌రాయ్, శివమ్ శుక్లా, రాజన్ రావత్, మహమ్మద్ అనస్ ఉన్నారు. ఈ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో సహ యజమాని శ్రీనాథ్ చిట్టూరి, రగ్బీ ఇండియా ప్రెసిడెంట్, లీగ్ కమిషనర్ రాహుల్ బోస్, జీఎంఆర్ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్, సీఎమ్‌వో సుజయ్ గంగూలీ, తదితరులు పాల్గొన్నారు. ఈనెల 16న తమ తొలి మ్యాచ్‌లో బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌తో హైదరాబాద్ హీరోస్ తలపడుతుంది.

హైదరాబాద్ హీరోస్ జట్టుతో కెప్టెన్ మెరెనో, సుమిత్‌కుమార్‌రాయ్, శ్రీనాథ్ చిట్టూరి, రాహుల్‌బోస్ తదితరులు

## చిరు వ్యాపారుల షాపులు తొలగించవద్దని వినతి

కొలన్ హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, జూన్ 11, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట పరిధిలో ఉన్న ఆర్జీకే ప్రాంతంలో సుమారు 15 ఏళ్లుగా డబ్బాలు, చిరు వ్యాపార షాపులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారులు తమ సమస్యలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో సుమారు 1,779 కుటుంబాలు, దాదాపు 7,000 మంది జనాభా నివసిస్తూ, పూర్తిగా ఈ చిరు వ్యాపారాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారు తెలిపారు. జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో తమ షాపులను తొలగించవద్దని కోరుతూ వ్యాపారులు గురువారం వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ అధికారులు జేసీబీలతో వచ్చి షాపులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీంతో వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కొలన్ హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చిరు వ్యాపారుల సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వస్తే ఖైరతాబాద్‌లో మళ్లీ అదే దుస్థితి?

**ఖైరతాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ ప్రాంతంలో అధికారులు, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నప్పటికీ వర్షాకాలం వచ్చిందంటే ప్రజల ఇబ్బందులు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేవలం గంటపాటు కురిసిన వర్షానికే పలు బస్తీలు, కాలనీల రహదారులు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లరి కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రి దానం నాగేందర్ తదితర ప్రజాప్రతినిధులు వర్షపు ముంపు ప్రాంతాలను సందర్శించిన ఘటనలను స్థానికులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. దశాబ్దాలు గడిచినా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉంటే, రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ముంపు సమస్యలను నివారించాలని కోరుతున్నారు. ముఖ్యంగా బీజేఆర్ నగర్, మారుతి నగర్, రాజానగర్, సీఐబీ క్వార్టర్స్, చింతలబస్తీ, తుమ్మలబస్తీ తదితర ప్రాంతాల్లో ప్రధాన నాలాలు, డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత ప్రణాళికతో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

## వైద్య చికిత్స కోసం ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం తన నివాస కార్యాలయంలో నిరుపేద కుటుంబానికి రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీ అందజేశారు. రసూల్ పుర ఇందిరమ్మ నగర్ ప్రాంతానికి చెందిన రాజుకు ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పేదవాడి వైద్యానికి డబ్బు అడ్డు రాకూడదని, మీ ఆరోగ్యమే మా ప్రభుత్వ ప్రాధాన్యతని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## రీల్ హీరోగా కనిపిస్తున్న పవన్ కల్యాణ్

### వాస్తవానికి రియల్ విలన్ : ఎడ్ల సుధాకర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై బిఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి గురువారం విమర్శలు చేశారు. తెలంగాణకు చెందిన వ్యక్తుల సేవా భావాన్ని ఎవరూ మరచిపోలేరని, తన మామగారు ప్రముఖ సీనీనటుడు డాక్టర్ మండాడి ప్రభాకర్‌రెడ్డి అలాంటి నిస్వార్థ వ్యక్తిత్వానికి ప్రతీక అని సుధాకర్ రెడ్డి ఏడ్ల పేర్కొన్నారు. తెలంగాణకు తానే రక్షకుడినన్నట్లుగా పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.30 కోట్ల విరాళాన్ని వ్యక్తిగత నిధులతో కాకుండా తిరుమల తిరుపతి దేవస్థానం ఖజానా నుంచి అందించారని ఆరోపించారు. అలాగే ప్రజా గాయకుడు గద్దర్‌కు స్వల్ప ఆర్థిక సాయం చేసిన విషయాన్ని పెద్దగా ప్రచారం చేసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. రీల్ హీరోగా కనిపిస్తున్న పవన్ కల్యాణ్, వాస్తవానికి రియల్ విలన్ అంటూ సుధాకర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తులను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## 20లోపు నర్సింగ్ ఆఫీసర్స్‌కు నియామపత్రాలు అందిస్తాం : డైరెక్టర్

**బేగంబజార్,జూన్ 11 ప్రభాతవార్త:** వైద్య,ఆరోగ్య శాఖలో సెలెక్ట్ అయిన 2087 మంది నర్సింగ్ ఆఫీసర్స్‌లకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ వందలాది మంది కోఠిలోని డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈసందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో సెలెక్ట్ అయిన 2087 మంది నర్సింగ్ ఆఫీసర్స్‌కు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1200మంది నిరుద్యోగులు వైద్యఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన సందర్భంగా డైరెక్టర్ ఆర్.కృష్ణయ్యతో వచ్చి సెలెక్ట్ అయిన నర్సింగ్ ఆఫీసర్స్‌కు ఈనెల 20లోగా పోస్టింగ్స్‌లు ఇస్తామని డైరెక్టర్ హామి ఇచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖలో 12వేల మందికి పోస్టులు భర్తీ చేసినందుకుగాను సిఎం రేవంత్‌రెడ్డికి,వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ముట్టడి కార్యాక్రమంలో బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి,బిసి ఐక్యవేధిక కుల సంఘాల అధ్యక్షులు అనంతయ్య,బిసి సంఘాల రాజేందర్,బిసి విద్యార్థి సంఘం ప్రతినిధులు రాందేవ్‌మోడి,ప్రీతం,నిఖిల్,రఘుపతి పాల్గొన్నారు.

# ప్రాచీన ఆధునిక వైద్యవిజ్ఞానంతో మెరుగైన ఫలితాలు

**నాంపల్లి, జూన్ 11 ప్రభాతవార్త :** నేటి అధునాతన వైద్యంతో పాటు ప్రాచీన వైద్యవిజ్ఞానంతో సమన్వయం ద్వారా క్యాన్సర్ రోగులకు చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని అనుగ్న్యా హోలిస్టిక్ ప్రముఖ వైద్యుడు రాజీవ్‌లాల్ అన్నారు. రెడ్‌హిల్స్‌లోని ఫ్ట్యాప్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఈమేరకు ఆయన ప్రసంగిస్తూ వివరించారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ కేర్ వ్యవస్థాపకులు సంగీత భల్లా, ఐపిఎఫ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు వివేక్‌వర్మతో క్యాన్సర్ నివారణలో ప్రాచీన వైద్యవిధానాలను అనుకరిస్తూ ఆధునిక వైద్యంతో రోగికి పూర్తిస్థాయిలో కోలుకునేందుకు అవసరమైన చికిత్సా పద్ధతులను డా. రాజీవ్‌లాల్ వివరించారు. అత్యాధునిక వైద్యం క్యాన్సర్‌కు సమర్ధవంతంగా చికిత్స చేయగలిగినా రోగి మానసికం, శారీరకంగా పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అందువల్ల క్యాన్సర్ రోగులు పూర్తిస్థాయిలో వైద్యం తీసుకోవడం లేదని, టాటా మెమోరియల్ సెంటర్ హాస్పిటల్ ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రకారం 50శాతం కంటే తక్కువగా ఉందని తేలిందన్నారు. తగు కారణాలను విశ్లేషిస్తే రోగికి ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ సభ్యుల సహకారం సరిగా లేకపోవడం, దానికితోడు సామాజిక అపోహలు, చికిత్సలో వచ్చే సవాళ్లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం అన్వేషించే క్రమంలో క్యాన్సర్ కేంద్రాలలో అమలవుతున్న సంరక్షణ విధానాలను అధ్యయనం చేశామని చెప్పారు. సంప్రదాయ క్యాన్సర్ చికిత్సతోపాటు ఎనర్జీ మెడిసిన్, ఆక్యుపంక్చర్, అరోమా థెరఫీ వంటి ప్రాచీన సహాయ చికిత్సలను రోగికి అందిస్తూ నొప్పి, అలసట, ఒత్తిడి, చికిత్స దుష్ప్రభావాలను తగ్గించవచ్చునని తెలిపారు. దేశంలోని క్యాన్సర్ రోగులకు, వారి సంరక్షకులకు సమగ్ర సహాయ సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయం తాము సంపూర్ణ కృషిచేస్తున్నట్లు వారు విశదీకరించారు.

సమావేశంలో పాల్గొన్న వైద్యులు

# అరుదైన ఘనత సాధించిన నార్మ్ శాస్త్రవేత్త

### -ప్రధాని పరిశోధన గ్రాంట్ సాధించిన

**శాస్త్రవేత్త సురేష్ కుమార్ మొజ్జాడ**

**అత్తాపూర్ జూన్ 11,ప్రభాతవార్త :** దేశ సముద్రాధారిత ఆర్థికాభివృద్ధి రంగంలో కీలక మైలురాయిగా నిలిచే అరుదైన ఘనతను ఐకార్–నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) హైదరాబాద్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ కుమార్ మొజ్జాడ సాధించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్ఆర్ఎఫ్) అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధాన మంత్రి ఎర్లీ కెరీర్ రీసెర్చ్ గ్రాంట్‌ను ఆయన గెలుచుకున్నారు. దేశవ్యాప్తంగా వేలాది పరిశోధన ప్రతిపాదనల మధ్య అత్యంత పోటీతో కూడిన ఎంపిక ప్రక్రియలో డా. మొజ్జాడ ప్రతిపాదించిన పరిశోధన ప్రాజెక్టు ఎంపిక కావడం విశేషం. రూ.63.7 లక్షల నిధులతో అమలుకానున్న ఈ ప్రాజెక్టు భారత సముద్ర మత్స్యపాలన రంగానికి శాస్త్రీయ, సాంకేతిక మరియు ఆర్థిక ప్రణాళికలలో కొత్త దిశను నిర్దేశించనుంది. ఈ సందర్భంగా డా. సురేష్ కుమార్ మొజ్జాడ మాట్లాడుతూ..భారత మారి కల్చర్ రంగాన్ని సంప్రదాయ ఉత్పత్తి వ్యవస్థల నుంచి శాస్త్రీయ ప్రణాళిక, పెట్టుబడిదారులకు అనుకూలమైన అభివృద్ధి నమూనా వైపు తీసుకెళ్లడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. జీవశాస్త్రం, భౌగోళిక సమాచారం, సామాజికఆర్థిక అంశాలు, వ్యవస్థాపకతలను సమగ్రంగా అనుసంధానించే నిర్ణయ మద్దతు వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా సముద్రాధారిత ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపించగలమనే నమ్మకం ఉందని తెలిపారు.

శాస్త్రవేత్త సురేష్ కుమార్ మొజ్జాడ

# దివ్యాంగుల సంక్షేమం కోసం సహాయ సహకారాలు

### -కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త** తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పి. రామచంద్రయ్య ఆధ్వర్యంలో అన్నపూర్ణ స్కీమ్ ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు మల్కాజ్గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అలాగే బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, దివ్యాంగుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రామచంద్రయ్యతో కలిసి త్వరలో మరింత పెద్ద స్థాయిలో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, మహిళా అధ్యక్షురాలు కవిత, సుజాత గౌడ్, పారిజాత, స్వాతి ముదిరాజ్, సీనియర్ నాయకులు దారం వెంకటేశం గుప్త,స్థానిక నాయకులు మహంకాళి సూర్యనారాయణ, జేరుపోతుల రవీందర్ రావు, ఎడ్ల ప్రభాకర్, దారం సతీష్ గుప్తా, దండు కుమార్, ముత్యాల మురళీధర్, మల్లారెడ్డి, నర్ర దేవేందర్ రెడ్డి, మొగుడంపల్లి కిరణ్ గుప్తా, కందుల రమేష్, సోషల్ మీడియా అధ్యక్షులు మొహమ్మద్ బాబా బాలానగర్ విద్యార్థి విభాగం అధ్యక్షులు సూర్య ప్రకాష్ కోరపాటి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## కుత్బుల్లాపూర్ ఎంఆర్ఓగా రాజేశ్ బాధ్యతల స్వీకరణ

**కుత్బుల్లాపూర్, జూన్11 ప్రభాతవార్త** ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తోడు ప్రజల అవసరాల మేరకు సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టనున్నట్లు కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి రాజేశ్ హామీఇచ్చారు. నూతన మండల రెవెన్యూ అధికారిగా బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వస్థలాల పరిరక్షణకు అధికారులతోపాటు ప్రజలు తమవంతు ప్రభుత్వస్థలాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కబ్జాదారులు ఎంతటివారైనా చట్టంముందు నిలబెట్టి కఠినంగా వ్యవహరించి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుల, ఆదాయ, నివాస దరఖాస్తు దారులకు ఎలాంటిజాప్యం లేకుండా సకాలంలో సేవలను అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా నేరుగా తనను సంప్రదించి జాప్యం నివారణకు , పనులను వేగవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలలను ఆక్రమించి బైనెంబర్లపేరుతో ఆక్రమించుకునేందుకు యత్నిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No: 11/EE-23 & 24/RJRNZ/GHMC/2026-27
పనిపేరు : (15) పని యొక్క సం. అంచనా ధర (రూ.లక్షలలో): 161.15. బిడ్స్ స్వీకరణలకు ప్రారంభ/వివరి తేదీ మరియు సమయం : డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 16.06.2026 సా.5.00గం. చివ. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ: 19.06.2026 సా.5.00గం. చివ. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: శ్రీ బి.నరేందర్ గౌడ్, EE, సర్కిల్ 23 & సర్కిల్ 24, RJNRJ

## దేశ ప్రతిష్టను పెంచిన ప్రధాని మోడీ : చౌకి రాజు

మలక్ పేటలో మోడీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న బిజెపి నాయకులు చౌకి రాజు, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, జూన్ 11,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారతదేశ ప్రతిష్ట పెరిగిందని గ్రేటర్ బిజెపి కార్యదర్శి చౌకి రాజు పేర్కొన్నారు. ప్రధానిగా మోడీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబురాలు నిర్వహించి మోడీ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ సారధ్యంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు కే. రాజు, నాయకులు చీపురు రాజారావు గౌడ్, సత్యనారాయణ, రాజ్ కుమార్, మూర్తి, రేవంత్, సంపత్, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా : మాజీ కార్పొరేటర్

**మల్కాజిగిరి జూన్ 11, ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ మంజు శంకర అపార్ట్మెంట్ దగ్గర మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ జిహెచ్ఎంసి అధికారులు మరియు కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు సమస్య డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అలాగే ట్రాన్స్ఫార్మర్ ని హైట్ పెంచాలని రోడ్డు మీద ఉన్న చెత్తను తొలగించాలని తదితర సమస్యలు కార్పొరేటర్ దృష్టి తీసుకురావడం జరిగింది వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య జ్యోతి వర్కింగ్ స్పెక్టర్ రజనీకాంత్ డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, రామకృష్ణ, సుబ్రమణ్యం,స్వామి, జయప్రకాష్, రత్న భూషణ్,లక్ష్మీ, శాంతమ్మ, శ్రీదేవి, జాన్సి,శ్రావణి, సంధ్యా,రేణుకా, వరలక్ష్మి,మహాలక్ష్మి, అర్చన,మంజుల, తదితరులు పాల్గొన్నారు

## గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు

గుంతలు పడ్డ రోడ్డుపై మొరం పోయిస్తున్న ప్రేమ్ నాథ్

**వనస్థలిపురం జూన్11,ప్రభాతవార్త** సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీ ఫేస్ 2,ఫేస్ 4 కు ప్రధాన రహదారి పై గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని కాలనీవాసుల ద్వారా తెలుసుకున్న సాహెబ్ నగర్ డివిజన్ కు చెందిన బి.జె.పి. సీనియర్ నాయకుడు గంగం ప్రేమ్ నాథ్ గాయత్రీ నగర్ కమాన్ నుండి గాయత్రీ అపార్టుమెంట్ వరకు గుంతలు పడ్డ రోడ్డు పై మొరం మట్టి పోయించి జేసీబీ తో చదును చేయించారు. దీంతో కాలనీవాసులకు కొంతమేర ఊరటనిచ్చింది. కాగా త్వరలోనే సి.సి. రోడ్డు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రేమ్ నాథ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం : మల్ రెడ్డి రంగారెడ్డి



న లబ్ధిదారులకు చెక్కు అందుస్తున్న ఎమ్మెల్యే

**హయత్ నగర్, జూన్ 11 ప్రభాతవార్త :** అన్ని వర్గాల ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేటలోని తారా ఫంక్షన్ హాల్ లో గురువారం అబ్దుల్లా పూర్ మెట్ మండలానికి సంబందించి తుర్కయంజాల్ జోన్ కు చెందిన 153 మందికి, పెద్ద అంబర్ పేట్ లో 140 మందికి, అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన 107 మంది మొత్తం 400 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీమూరక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతనన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మున్సిపాలిటీలకు అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇక గ్రామాలలో సైతం కనీస మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. కోహెడలో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారని సాధ్యమయినంత త్వరలో పూర్తి చేస్తామన్నారు.

## శ్రీనగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పర్యటన

శ్రీనగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త :** బీరప్ప గడ్డ డివిజన్ శ్రీనగర్ కాలనీలో అధ్యక్షులు ఓం ప్రకాష్ అభ్యర్థన మేరకు గురువారం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పర్యటించారు. కొన్ని వీధుల్లో నూతనంగా నిర్మించాల్సి స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ల అవసరాన్ని గుర్తించారు. అదేవిధంగా కొన్ని వీధుల్లో పాడైపోయిన సిసి రోడ్ల స్థానంలో నూతన సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ ఆంజనేయస్వామి ఆలయంలో వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని వీసీ లాడ్జ్ ప్రాంగణంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు, కుంభాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆలయంలో సంభవించిన అగ్నిప్రమాదం అనంతరం దేవస్థాన శుద్ధి కార్యక్రమాలతో పాటు ఆలయ పునఃప్రతిష్ఠకు సంకేతంగా ప్రత్యేక శాంతి పూజలు, హోమాలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కుంభాభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించగా, తెలంగాణ ఉద్యమకారుల ప్రభుత్వ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను అభినందించిన వారు, ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, గణపతి హోమం, పుణ్యాహవాచనం, మండపారాధన, సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం, నవగ్రహ శాంతి పూజలు, కుంభాభిషేకం వంటి ప్రధాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు మహా అన్నదాన

ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందడంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఉస్మానియా యూనివర్సిటీ పరిసర ప్రాంతాల భక్తులు, సామాజిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పాలి..

**-మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు**

**నేరేడ్ మెట్ , జూన్ 11, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు యువత కీలక పాత్ర పోషించాలని వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం – పర్యావరణ పరిరక్షణ" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ వ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతోందని వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలు, చెరువులు, నదుల్లో పేరుకుపోవడం వల్ల జల కాలుష్యం పెరుగుతోందని, పశువులు, పక్షులు, జలచరాల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. వ్యర్థాల వర్గీకరణ, పునర్వినియోగం, రీసైక్లింగ్ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన

వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్ షార్ట్స్ వేదికల ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన అంశాలపై నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, బోటనీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, లింగయ్య, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని విస్తరించేందుకు విద్యార్థులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో నిజనిర్ధారణ కమిషన్ పర్యటన

**ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఅవుట్‌లో గురువారం లోకాయుక్త నిజనిర్ధారణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ మహేందర్ ఇతర అధికారులు పర్యటించారు. ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్ లో నెలకొన్న పలు సమస్యలపై ఆయా ప్రభుత్వాల పెద్దల వద్ద, ఆయా శాఖల అధికారుల వద్దకు తిరిగి తిరిగి అలసి విసిగిపోయి 2024 వ సంవత్సరంలో ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్. నేతలు లోకాయుక్త కోర్టును ఆశ్రయించారు. దీంతో గురువారం హెచ్ఎండిఏ,జిహెచ్ఎంసి అధికారులతో అసోసియేషన్ సభ్యుల సమక్షంలో నిజనిర్ధారణ కమిషన్ అధికారులు లేఔట్‌లో సమస్యల గురించి నిశిత పరిశీలించారు. లేఔట్ లో పలు సమస్యల పరిష్కారానికై కొంతమంది పెద్దల న్యాయ సలహాల మేరకు లోకాయుక్త కోర్టును ఆశ్రయించామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. హెచ్ఎండిఏను, జిహెచ్ఎంసిని బాధ్యులను చేస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు తదుపరి లోకాయుక్త కోర్టు ఫిర్యాదారునీ వాదనలకు అనుమతి ఇచ్చి పలు వాయిదాలకు ఆహ్వానించిందని, అసోసియేషన్ సభ్యులు పలు వాయిదాలకు హాజరయ్యి లేఔట్ లో సమస్యల తీవ్రతను కోర్టు వివరించామని చెప్పారు.. సమస్యను తెలుసుకున్న లోకాయుక్త కోర్టు బాధ్యులుగా చేర్చబడిన హెచ్ఎండిఏకి, జిహెచ్ఎంసికి, నోటీసులు అందించి వివరణ తీసుకున్నారని తెలిపారు. విచారణ జరుగుతున్న నేపథ్యంలోనే లోకాయుక్త కోర్టు జోక్యం చేసుకొని ఇరువురి శాఖలపై ఆగ్రహించిన తదుపరి (హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి) సమస్యలపై శ్రద్ధ పెట్టినట్లు కొంతమేరకు రోడ్లు బ్లాక్ టాప్ వేయడం, పొంగిపోయే డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ ను బాగు చేయటం, కొంతమంది పారిశుద్ధ్య కార్మికులను నియమించడం, కొత్త వీధి దీపాలు అమర్చడం లాంటి

ఉప్పల్ భగాయత్‌లో పర్యటించిన లోకాయుక్తా నిజనిర్ధారణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, ఇతర అధికారులు

కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. గురువారం లోకాయుక్త కోర్టు డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, లోకాయుక్త ఇన్స్పెక్టర్ మహేందర్ , లేఔట్ లో ప్రస్తుత పరిస్థితులను అసోసియేషన్ సభ్యుల సమక్షంలో పరిశీలించారు. ఈ పరిశీలన నేపథ్యంలో జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ డిసి శైలజ , టౌన్ ప్లానింగ్ ఏసిపి నాగిరెడ్డి , హెచ్ఎండిఏ డి ఈ సత్య ప్రసాద్, ఏఈ వెంకటేష్ పాల్గొని లేఅవుట్ లో ప్రస్తుత పరిస్థితులను లోకాయుక్త అధికారులకు వివరించారు. నిజనిర్ధారణ కమిషన్ లేఔట్ లో పూర్తి పరిశీలన అనంతరం పూర్తి నివేదిక తయారుచేసి కోర్టు ముందు పొందుపరచడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు రవీందర్ రెడ్డి , చంద్రశేఖర్ , నరోత్తం రెడ్డి ,మాధవ రెడ్డి , కమల్ , అల్లం శివప్రసాద్ గారు, సుమన్ , కోటేశ్వరరావు ,మల్లికార్జున్ ,ఆదిత్య ,సంతోష్ ,సందీప్ , తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకు ఓపి సేవలు

**-ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి**

**-వైద్యాధికారులకు డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశం**

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:** పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందాలని ఆదిశగా వైద్యాధికారులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవఖాన లోని వైద్యులతో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే వారికి ఓపి సేవలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపి నిర్వహించాలని సూచించారు .ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కార్యాలయం నుండి సమాచారం పంపిస్తే వెంటనే స్పందించాలని, సకాలంలో కార్యక్రమాల నివేదికలు పంపాలన్నారు. ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు, అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చే వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వైద్యాధికారులు ప్రతిరోజు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్టా శ్రీనివాస్

స్వయంగా ఓపి రోగుల సేవలను చూసి ఓపి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. డయాగ్నొస్టిక్ సేవలు అన్ని ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని, అవసరమైన రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి రిపోర్ట్స్ వెంటనే అందించాలని సూచించారు. అత్యవసర రోగులకు ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని ఏదైనా ప్రమాదానికి గురైన వారికి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. శ్రీధర్, డా. సాయిబాబా, డా, శ్రీకళ , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యాధికారులు , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కులతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం

**-రూ.52 లక్షలతో ఏర్పాటు చేసిన పార్కులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**అత్తాపూర్ జూన్ 11,ప్రభాతవార్త :** ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు . రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లో ఏర్పాటు చేసిన రెండు పార్కులను గురువారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించినప్పుడు మానసిక ప్రశాంతత ఉంటుందని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన జీవన విధానాలను కల్పించడానికి పార్కులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోవడానికి, కుటుంబంతో కలిసి సేద తీరడానికి, చిన్నపిల్లలు ఆడుకోవడానికి పార్కులు అనుకూలంగా ఉంటాయన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,

రాజేంద్రనగర్ సర్కిల్ జన చైతన్య కాలనీలో రూ. 29.91 లక్షలతో ఒక పార్కు , అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ సిరిమల్లె నగర్ కాలనీలో రూ. 22.34 లక్షలతో ఒక పార్కు ను అభివృద్ధి చేయ డం జరిగిందన్నారు. ఇలాంటి పార్కులు స్థానిక ప్రజలకు, కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న పార్కులన్నింటినీ అందంగా తీర్చిదిద్దడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిష నర్లు సురేందర్ రెడ్డి,మల్లారెడ్డి ,అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్టిపి ప్లాంట్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువు వద్ద నూతనంగా చేపడుతున్న 10 ఎం.ఎల్.డి ఎస్టిపి ప్లాంట్ పనులను ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువులో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు గురించి తాను శాసనసభలో కూడా ప్రస్తావించడం జరిగిందని అంతేగాకుండా అధికారులకు పలుమార్లు సమస్యను వివరించి ఎస్టీపి ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే ప్రస్తుతం నూతన ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. అయితే 10 ఎం.ఎల్.డి ప్లాంట్ కాకుండా ఇక్కడ 20 ఎం.ఎల్.డి ఎస్టిపి ప్లాంట్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. దీనివల్ల తక్కువ స్థలంలో ఎక్కువ మురుగునీరు శుద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువుల వద్ద ఎస్టిపి ప్లాంట్స్ నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు. ఎస్టిపి ప్లాంట్స్ వద్ద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే నిర్వాహణ భారం కూడా తగ్గుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 32 ఎస్టిపిలు మంజూరు చేయించి 75 శాతం పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుదర్శన్, వినోద్‌కుమార్, నాయకులు తిలక్‌రావు, బెల్ధ నర్సింహా గుప్తా, రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, రాకేష్, ఇంద్రాజీ, ఠాగూర్, ప్రకాష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టిపి ప్లాంట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## ఉప్పల్‌లో రూ.కోటి 35 లక్షలతో అభివృద్ధి పనులు : రజిత రెడ్డి

**ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సత్య నగర్, శాంతి నగర్ లో రూ కోటి 35 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ పనులను గురువారం మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం పనులు చేపడుతున్నామని తెలిపారు. రూ1.35 లక్షలతో డ్రైనేజీ, నిర్మాణం పనులు చేపట్టినట్టు చెప్పారు. వచ్చే వర్షాకాలం లోపు డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు . త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయని చెప్పారు. సత్య నగర్, శాంతినగర్ కాలనీను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు కె. విజయ్ కుమార్,కె. సతీష్ ముధిరాజ్,ఎ. శివ కుమార్, పి. సంజీవ రెడ్డి, యు.రాజు గుప్తా, సీనియర్ సత్యనారాయణ, నరేష్ చారి, బి. రాజు,జె. భాను, కరుణాకర్ రాజు,రమణ,ఎం. విజయ్ కుమార్, ఎం. సురేష్, సత్యనారాయణ,ఏక స్వామి, లక్ష్మి,శివ పార్వతి,శిరీష వాణి,వాణి,ఎ. లక్ష్మి,లత,సరోజిని,సుజాత,పద్ తదితరులు పాల్గొన్నారు

ఉప్పల్ సత్య నగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత రెడ్డి తదితరులు

## బిఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శంభీపూర్ రాజుతో ఉప్పల్ నేతల బేటి

శంభీపూర్ రాజుతో బేటి అయిన ఉప్పల్ నేత అరటికాయల భాస్కర్ తదితరులు

**ఉప్పల్, జూన్ 11 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత అరటికాయల భాస్కర్ గారి ఆధ్వర్యంలో గురువారం పలువురు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా మాజీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు తో బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ డివిజన్ పార్టీ యొక్క స్థితిగతులను వివరించారు . పార్టీ లోని అంశాలను వివరించిన అనంతరం పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్టు తెలిపారు. దీనికి శంభీపూర్ రాజు స్పందిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ చెప్పి రాబోయే రోజుల్లో ఉప్పల్ డివిజన్ లో పార్టీ బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు . కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ మాజీ అధ్యక్షులు వేముల సంతోష్ రెడ్డి,మాజీ ప్రధాన కార్యదర్శి సోమసాని ప్రవీణ్,సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు వేముల వెంకట్ రెడ్డి,మాజీ ఉపాధ్యక్షుడు అన్య వెంకటేష్,మాజీ జాయింట్ సెక్రటరీ సురవి సత్యపాల్ రెడ్డి, బిఆర్ఎస్ మాజీ యువజన అధ్యక్షుడు అరటికాయల వంశీ ముదిరాజ్, బిసి సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి మురళి, సంయుక్త కార్యదర్శి తుమ్మలపల్లి యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రధాని మోడీ కృషి : కొల్లి నాగేశ్వరరావు

**మలక్ పేట, జూన్ 11, ప్రభాతవార్త